# కాదనడం కష్టం

క్రప్పగంతుల ఆంజనేయశాస్త్రిగారికి ఎనభై అయిదో సంవత్సరం నడుస్తోందంటే ఆయన్ని చూసిన వారెవ్వరికీ నమ్మబుద్ధి వెయ్యదు. నాటికీ నేటికీ పనులు నిర్వహించడంలో ఆయనకున్న స్పీడూ యాక్టివిటీ గమనిస్తే ఇంకా మీసాలు ట్రిమ్ చెయ్యడం నేర్వని ఆయన మనవలికి కూడా తారెత్తిపోతుంది.

చావుకికూడా ఆయన పేరుచెబితే తావుల్దిప్పితే,రోగాలు ఆయన దరిదాపులకి రాడానికి గజగజలాడాయంటే ఆశ్చర్యమేముంది!కళ్ళజోడురావొచ్చు, కర్ర చేతికి తప్పకపోవచ్చు, జిర్రున చీది ఎరగని ఆ శరీరతత్వమూ, ఎర్రగాచూస్తే ఎంతటి వాణ్ణయినా హడలగొట్టించే ఆ వ్యక్తితత్వమూ, వీటికెలా ఉంటుంది ఢోకా?

"పుట్టిన వాళ్ళందరూ బాగుండి పైకొస్తే ఎన్ని కబుర్లయినా చెప్పొచ్చు, పట్టినపథకాలన్నీ బంగారమై అంతా స్వయంకృషి అని చాటుకోవచ్చు" అనే అభిప్రాయం వారి బంధువుల్లో కొందరికి లేకపోలేదు. అయినా ఆయన కనుదమ్ముల్లోకి ఓసారి చూసేసరికి అలా పైకి అనాలనేవారి కోరిక దమ్ముల్లేక ఎక్కడికక్కడే దుమ్ములో కలిసిపోతుంది.

పాతిక మంది కుటుంబ సభ్యులకి పాతికేళ్ళ పై మాటగా ఆయన చెప్పిందే వేదం, చూపిందే మార్గం. ఇంటిల్లిపాదిలోనూ ఆరడుగుల ఆయన ఎత్తుకి చేరినవారు లేనట్టే ఆయన ఎత్తిన ఎత్తుని ఎత్తిపెట్టేవారు లేరనుకొనే సమయంలో....ముని మనవడి వయసుగల కుర్రాడొకడు శాస్త్రిగారి లోటుపాట్లు అక్కడా ఇక్కడా అనడం ప్రారంభించాడు. అయితే అవి ఇంతవరకు ఆయన చెవిన చేరినట్టులేదు.

మొట్టమొదట్నుంచీ కట్టుబాట్లలో ఉంచాడు గనక ఆ యింటి ఆడంగులకి ఆయన ముందు నోరెత్తే ఛాన్సు ఎప్పుడూలేదు. మగవాళ్ళ కయినా ఎవరి బలహీనతలు వాళ్ళకున్నాయి. పెద్దకొడుక్కి పేకాడితేగాని పొద్దు గడవదు. మూడో మనవడు చెయిన్ స్మోకరు. బ్రహ్మచారిగా ఉండి పోయి శాస్త్రిగారి పనులు దగ్గిరుండి చక్కబెట్టే తమ్ముడి కొడుక్కి చుక్క వేసుకోందే నిద్రపట్టదు. ఇలాంటివి ఉన్నవాళ్ళకి ఇవిలేని వాళ్ళమీద కపట భక్తి సహజం. భక్తోభయమో-తను రైటనుకున్నది అక్షరాలా ఆచరణలో పెట్టడమే శాస్త్రిగారి ఆశయం. పెద్దగా పాటుపడకుండా నీడపాటున బతుకులు వెళ్ళిపోవడమే ఆ యింటి మగవాళ్ళ కోరిక. ఆయన ఏక ఛత్రాధిపత్యం ఇంతకాలం సాగడానికి వారి బాధ్యత కూడా తక్కువేం కాదు మరి!

ఈ మెతక సరుకులోకి మెరుపుదాడిలా ప్రవేశించిన మెరిక పేరు శివం. మొన్నటి ఎలక్షన్లకి ఓటుహక్కు వచ్చిన వయసు వాడిది. ఢిల్లీలో చదువుకుంటూ ముత్తాతగార్ని స్టడీచెయ్యడానికి శలవలకి వచ్చాడు.

'అందర్లా చాటునగాక ఎదురుగా సిగరెట్లుతాగి ముత్తాత మొహాన్నే పొగవదులుతాడు, హవాయ్ స్లిప్పర్స్‌తో ఇల్లంతా తిరుగుతాడు, ఇరవై అయిదు రూపాయిలు కట్టి తన పేరు చివరి 'శాస్త్రి' తెగ్గొట్టించుకున్నానని చెబుతాడు...యిలాటివేగా చేస్తాడు' అని శివం గురించి విన్నవాళ్ళంతా అనుకున్నారుగాని అలాటివి ఒక్కటైనా చెయ్యలేదు! పైగా ఆయన దీకాక్షను కాఫీ అయినా పుచ్చుకుంటారేమోగాని వాడు వక్కపొడి అయినా వేసుకున్నట్లు కనపడదు.

"మీ ముత్తాతగారి జీవిత చరిత్రగాని రాస్తావా ఏం రా?" అని అడిగింది శాస్త్రిగారి భార్య—వాడొచ్చిన వారానికి కాబోలు. "రాయాలనే ఉందండీ, ఎందుకో తెలుసా? అలాంటి పొరపాటు నాయకత్వం మరెవరూ వహించకుండా." ఈ మాట శివం హాలులో నిలబడి గట్టిగా అన్నాడేమో ఎక్కడివాళ్ళక్కడ పనులు మానేసి అక్కడ పోగయిపోయారు. నిరంకుశా నికి జవాబుగా ఏ చిన్న విప్లవకారుడు దొరికినా ఆ వీపు వెనక చేరడం 'మంద' బుద్ధి ముఖ్యలక్షణం కదా! ఆ వేళకి శాస్త్రిగారు ఇంట్లో లేరను కోడం వారికాపాటి ధైర్యాన్నయినా ప్రసాదించింది. శివం కొనసాగించాడు

"కొన్ని దశాబ్దాల నుంచి తాతగారు దేన్నయినా తన దృష్టినుంచే పరిశీలించి పరిష్కరించడం చేస్తున్నారు. బద్ధకస్తులూ భోగలాలసులూ అయినకుటుంబ సభ్యులు ఆ మనస్థయిర్యాన్ని తమ స్వార్థానికి అనువుగా మలచుకున్నారు. తాతగారు దాన్ని తమ నాయకత్వాన్ని గౌరవించడంగా, తమ పెద్దరికాన్ని మన్నించడంగా అర్థం చేసుకున్నారు. తమ ఏలుబడిని మరింత సంకుచితంగా రూపు దిద్దుకున్నారు. ఇంట్లో అయినా రాష్ట్రంలో అయినా దేశంలో అయినా హీరో వర్షిప్ ఉంటే నీరోలు వర్ధిల్లక మానరు. తాతగారిది చాలా మంచి ఆరోగ్యం గనక ఎవరికేరోగం వచ్చినా "ఏదో తినేసి ఉంటారు, భరించండి" అంటారు. ఆయన్ది చాలా జాగ్రత్త గనక ఎవరింట్లో ఏ దొంగతనం జరిగినా 'అశ్రద్ధగా ఉంటే ఏమవుతుంది, అనుభవించండి' అంటారు. వీటన్నిటినీ మించి ఈ వారంలో నేను ఆయన్లో ఓ ప్రత్యేకత చూశా..."

నిజానికి ఊరికి బిగబెట్టుకు వింటున్న ఆఇంటి జనంతో పాటు శివం చూడనిది ఒకటుంది. చడీ చప్పుడూ లేకుండా చాటున నిలబడి శాస్త్రి గారు ఆ చుట్టుపక్కలే ఉండి వినడం!!

"ఓ ఉదాహరణ యిస్తే నే చెప్పేది ఇంకా మీకు సులువుగా బోధ పడుతుంది. ఇప్పుడొస్తున్నాయి చూడండి, గ్రైండర్, కుకర్, గాస్‌స్టవ్, ఫ్రిజ్ ఇలాంటి వంటింటి సులభ సాధనాలు పల్లెటూళ్ళో సహా ఇవిప్పుడు వాడుతున్నారు. ఇంకా యివిక్కడ చేరలేదంటే ఆయన మనస్తత్వమే కారణం. తాతగారు తన జీవితంలో ఎంతో కష్టపడి పైకొచ్చారు. ఇంకో అంత కష్టపడి ఇంత ఆస్తిని నిలబెట్టుకొచ్చారు. ఇప్పటికీ ఎంతో కష్టంతో ఇంత పెద్ద సంసారాన్ని ఒక్క చేతిన ఈడ్చుకొస్తున్నానని విశ్వసిస్తున్నారు. అందుకనే కష్టపడందే లభించే ఫలితాలు, అంటే 'తేలిక సాధనాలు' ఆయన ఆమోదించలేదు. సులభంగా జరిగిపోయేదేదీ ఆయనకి నచ్చదు. పెద్దమామయ్య పెళ్ళికి ఏమైందిట! ఉన్నఊళ్ళో హాయిగా కన్నుల కలిగినట్టు పెళ్ళిచేస్తానని కన్యాదాత మొత్తుకుంటే యీయన విన్నారా! రెండొందలమందినీ తిరపతికి నడిపించారు. తిరిగొచ్చేసరికి సగంమందికి జ్వరాలుట. అక్కడికి గాని ఆయనకి పెళ్ళైనట్టు ఉండదు!"

"ఓరి డిప్పకాయీ, హనుమంతుడి దగ్గిరట్రా కుప్పిగంతులు?" అంటూ ఇక ఉండలేక శాస్త్రిగారు వెనకనుంచి శివం జబ్బచరిచారు. ఎక్కడి వాళ్ళక్కడ చల్లగా సర్దుకున్నారుగాని శివం చెక్కుచెదరలేదు. పైగా ఇటు తిరిగి ఇలా జవాబు చెప్పాడు:

"నియమాలూ నీతులూ కాలాన్నిబట్టి మారక తప్పదు తాతయ్యా! నోటిమాటకాదు రుజువు కూడా ఉంది, కావలిస్తే చూడు. నిన్ను నమ్మి కిమ్మనకుండా పడి ఉన్నారనుకుంటున్నావే నీ నాయకత్వంలోని యీ ఇంటి జనం, మరి నీకు వ్యతిరేకంగా నేను చెబుతూంటే, ఇంత సేపూ అంత ఆసక్తితో విన్నారేం!"